సాక్షి సిద్దిపేట

గురువారం : 6 ఏప్రిల్ : 2023



భేతాళస్వామి జాతరకు వేళాయె

ఈనెల 7వ తేదీ నుంచి జరిగే అల్లాదుర్గం భేతాళస్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏడుపాయల తర్వాత ఈ జాతరను ఘనంగా నిర్వహిస్తారు 8లో..




హిందువులు ఐక్యంగా ఉండాలి

హిందువులు ఐక్యంగా ఉండాలని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్ అన్నారు. చిన్నశంకరంపేట అభయ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని నిర్వహించారు. 8లో..



ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి

బాబూ జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. 9లో..



రీసైక్లింగ్ దందా

- దారిమళ్లుతున్న సీఎంఆర్ ధాన్యం
- రైస్ మిల్లర్ల ఇష్టారాజ్యం
- కొనసాగుతున్న పోలీస్ విచారణ



రైస్ మిల్లులో మరాడించిన బియ్యం


సాక్షి, సిద్దిపేట: కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించి మిల్లులకు తరలించిన ధాన్యం పక్కదారి పడుతోంది. మరాడించి ధాన్యాన్ని ఎక్కువ ధరకు బయట మార్కెట్‌లో అమ్ముకుంటూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడితో ఆగకుండా లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి సీఎంఆర్ కింద అప్పగిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధాన్యంకు డిమాండ్ ఉండటంతో మిల్లర్లు రీసైక్లింగ్ దందాకు తెరలేపారు. తాజాగా హుస్నాబాద్‌లో ఏఆర్‌ఎం ఆగ్రో ఇండస్ట్రీస్‌లో రూ.27.76కోట్ల విలువ చేసే 9,522 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గతంలో చేర్యాలలో రూ.4.3కోట్ల విలువ చేసే ధాన్యం రాకున్నా.. వచ్చినట్లు తక్ పట్టీలు సృష్టించి రైతుల పేర్ల మీద డబ్బులను తీసుకున్న సంఘటనలున్నాయి.

డిమాండ్ ఉండడంతో..

- ప్రతీ వానాకాలం, యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సేకరించి ప్రభుత్వం మిల్లర్లకు అందిస్తోంది.
- సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద క్వింటాల్ వడ్లకు రా రైస్ 67 కిలోలు, బాయిల్డ్ రైస్ 68కిలోలు అందించాల్సి ఉంది.
- పల్లెలు, పట్టణాల్లో ఏజెంట్లను పెట్టుకున్న మిల్లర్లు లబ్ధిదారుల నుంచి కేజీ రూ.6 నుంచి రూ.8లకు పీడీఎస్ బియ్యాన్ని సేకరిస్తున్నారు.
- ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని డంప్ చేసి, మిల్లుల్లో సీఎంఆర్ బియ్యం పట్టే క్రమంలో పాలిష్ చేసి అప్పగిస్తున్నట్లు సమాచారం.
- పీడీఎస్ బియ్యం క్వింటాల్‌కు సుమారుగా రూ.800 చెల్లిస్తుండగా, మరాడించిన ధాన్యం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,500ల చొప్పున విక్రయిస్తున్నారు.
- ఒక్కో క్వింటాల్‌పై రూ.1,700 లాభం వస్తుండటంతో మిల్లర్లు అక్రమ దందాకు తెరలేపారు.

తనిఖీలు లేకపోవడంతో..

- మిల్లర్లకు అందించిన ధాన్యం నిల్వలపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోవడంతో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.
- వడ్లను మరాడించే సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సీఎంఆర్ బియ్యం పక్కదారి పడుతోంది.
- ఇతర రాష్ట్రాల్లో వరి తక్కువగా సాగవడం, మార్కెట్‌లో వడ్లకు డిమాండ్ ఉండడంతో ఏఆర్‌ఎం మిల్లు యాజమాన్యం సీఎంఆర్ బియ్యాన్ని బయట విక్రయించినట్లు తెలిసింది.
- ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మరాడించకుండానే హుస్నాబాద్‌లో ఓ మిల్లు యజమాని లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం సేకరించి పౌరసరఫరాల సంస్థకు అందించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.
- గతేడాది నవంబర్‌లో చేర్యాలలో వీరన్నపేట గ్రామ శివారు శ్రీసాయి లలిత బిన్నీ రైస్ మిల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 35 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.
- జిల్లా వ్యాప్తంగా పలు మిల్లుల్లో పీడీఎస్ బియ్యం పట్టుపబడిన సంఘటనలున్నాయి.
- హుస్నాబాద్‌లో జరిగిన సంఘటనపై పౌరసరఫరాల సంస్థ డీఎం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, పక్కన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, అధికారులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బీజేఆర్

- జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ
- జిల్లా కేంద్రంలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి
- హాజరైన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అధికారులు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీ శ్వేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో పుట్టినా, దళిత, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని, ప్రతీ ఒక్కరు చదువుకొని ఉన్నతస్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. దళితులు విదేశీ విద్య అభ్యసించేందుకు అంబేడ్కర్ ఓవర్ సిస్ స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ కులం కోసం కాకుండా దేశం కోసం జీవితాన్ని అంకితం చేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మహనీయుల జీవిత చరిత్రను పుస్తకం రూపంలో అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ.. మహనీయుల కృషి ఫలితంగా అందరం ఆనందంగా జీవిస్తున్నామని, వారి ఆశయాలను కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ నాయిని చంద్రం, ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి కవిత, డీపీఆర్ఓ రవికుమార్, టీఎన్జీఓ ప్రెసిడెంట్ పరమేశ్వర్, దళిత, ప్రజాసంఘాల నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, దొమ్మాట రవీందర్, భీమాసేన, రమేష్, భద్రయ్య, వెంకటేశం, కనకయ్య, ఇస్తారి, రామస్వామి, బాబు, చంద్రభాను, ప్రసాద్, శ్రీనివాస్, పెర్క పరశురాములు, శంకర్, లక్ష్మణ్, శివయ్య, అంజయ్య, శ్రీహరి యాదవ్, సాంస్కృతిక సారథి కళాకారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



గజ్వేల్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: భారతదేశ ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత అని కొనియాడారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజమౌళి, ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌లో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అమరావతి నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

సిద్దిపేటలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాపార్తి లింగమూర్తి



మాట్లాడుతున్న రాపార్తి లింగమూర్తి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అన్ని అర్హతలు కలిగిన సిద్దిపేటలో ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటుకు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాపార్తి లింగమూర్తి అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాల్లో భాగంగా బుధవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూనివర్సిటీ ఏర్పాటుతో గ్రామీణ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని, అన్ని హంగులతో యూనివర్సిటీని నిర్మించి, త్వరగా అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, కార్యదర్శి దాసరి ప్రశాంత్, రాష్ట్ర నాయకులు శంకర్, రాజు, మిశ్రిన్ సుల్తానా, కిరణ్, అనిల్ పాల్గొన్నారు.

'ట్రస్మా' నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

సిద్దిపేటకమాన్: ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా హరినాథ్, ఉపాధ్యక్షుడిగా సంతోష్, జాయింట్ సెక్రెటరీగా బాల్‌రెడ్డిని ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో రామచంద్రం, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



అవార్డు అందుకుంటున్న క్రీడాకారులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సీఎం కేసీఆర్ సీజన్-3 క్రికెట్ ట్రోఫీ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ క్రికెట్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన పోటీల్లో నారాయణరావుపేట ఇబ్రహీంపూర్, నాగరాజుపల్లి, రామంచ, పుల్లూరు గ్రామాల జట్లు విజయం సాధించాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులు మనోజ్‌కుమార్, భాస్కర్, బాలు, దేవేందర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కలకుంట్ల మల్లికార్జున్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం



న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేస్తున్న సాయిరాం

సిద్దిపేటజోన్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు సాయిరాం అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రజలకు వైద్యంపై నమ్మకం కలిగేలా ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, మంత్రి ఓఎస్డీ బాలరాజు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి అజీమ్, మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి రాము, తదితరులు పాల్గొన్నారు.

అధికారిని అడ్డుకున్న తుక్కాపూర్ గ్రామస్తులు



తుక్కాపూర్ శివారులో ఈఎన్సీ హరిరామ్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

తొగుట(దుబ్బాక): ప్రభుత్వాన్ని నమ్మితే నిలువునా మునిగామని, న్యాయం చేయాలని తుక్కాపూర్ గ్రామస్తులు కోరారు. బుధవారం గ్రామ సమీపంలో జరుగుతున్న కాలువ నిర్మాణ పనుల పరిశీలన వచ్చి వెళ్తుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ హరిరామ్ కారును గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువ నిర్మాణం కోసం భూమి ఇస్తే ప్రభుత్వం సరైన ప్యాకేజీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుభూములు కోల్పోయి కూలీలుగా మారామని, ప్రాజెక్టు నిర్మాణంతో తమ బతుకులు ఆగం చేశారని మండిపడ్డారు. కాలువ నిర్మాణంలో భాగంగా బండరాళ్లను తొలగించేందుకు చేసే బ్లాస్టింగ్‌తో రాళ్లు వచ్చి ఇళ్లపై పడుతున్నాయన్నారు. మల్లన్న సాగర్ కట్టను ఆనుకొని గ్రామం ఉండటంతో వానాకాలంలో ఇండ్లలోకి నీరు వస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని, లేదంటే కాలువ పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. స్పందించిన ఈఎన్సీ హరిరామ్ గ్రామస్తులకు నచ్చజెప్పి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రామనామ వ్యాప్తే లక్ష్యం



సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

శ్రీరామకోటి భక్త సమాజ నిర్వాహకుడు రామరాజు

గజ్వేల్: రామ నామం వ్యాప్తి చేయడమే లక్ష్యంగా లక్ష హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీరామకోటి భక్త సమాజం నిర్వాహకులు రామరాజు అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని కిరాణ వర్తక సంఘం భవనంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ హనుమాన్ విజయోత్సవం నాటికి లక్ష హనుమాన్ చాలీసా పారాయణం పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిద్ధి బిక్షపతి, కార్యదర్శి దూబకుంట మెట్రాములు, నాయకులు మర్యాల శ్రీను, దూబకుంట ప్రభాకర్, నంగునూరి సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్, అంతునూరి శివకుమార్, తోట బిక్షపతి, జగ్గారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లు, బదిలీలు పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయుల ప్రమోషన్, బదిలీల ప్రక్రియ పక్కాగా చేపట్టాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్ అధ్యక్షతన బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు, నాలుగేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. అటు పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రభావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి, జిల్లా కార్యదర్శులు వెంకట కిరణ్, కొడిపల్లి ప్రశాంత్ కుమార్, కనకరాజు, గిరిబాబు, యాదయ్య, రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, రాజిరెడ్డి, రాజ మల్లు, శ్రీను, తిరుపతి, గణేష్ రెడ్డి, సక్రియా, నిరంజన్, రవి, కృష్ణ, శివుడు, రాజనర్సింహ, రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర ఏర్పాట్లు పూర్తి

గజ్వేల్‌రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ప్రధాన వీధులగుండా శోభాయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వీర హనుమాన్ విజయయాత్ర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వర దేవాలయం నుంచి అంగడిపేట హనుమాన్ ఆలయం మీదుగా ఇందిరాపార్కు చౌరస్తా, ఎన్టీఆర్ విగ్రహం, తిరిగి ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా వర్గల్ రోడ్డులో సంతోషిమాత ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగుతుందని, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మన పత్తి మహారాష్ట్రకు

- మద్దతు ధర లేక రైతుల ఇక్కట్లు
- తప్పని పరిస్థితుల్లో తక్కువకే విక్రయం
- పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు



గుంటూరుపల్లెలో పత్తి లోడు చేస్తున్న దృశ్యం

హుస్నాబాద్‌రూరల్: పత్తి ధరలు గతేడాది రూ.10వేలకు చేరడంతో సంబరపడిన రైతులకు ఈ ఏడాది నిరాశే ఎదురవుతోంది. పంట చేతికి వచ్చి మార్కెట్‌కు తరలించే సమయానికి ధర తగ్గడంతో దిగాలు చెందారు. భవిష్యత్‌లో ధర పెరిగే అవకాశం ఉండడంతో చాలా మంది ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారు. ఆరు నెలలైనా మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం, నిల్వ చేసిన పత్తి పాడవుతుండడంతో దిక్కుతోచక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. కాగా రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసిన వ్యాపారులు పొరుగు రాష్ట్రాలకు తరలించి మంచి లాభాలకు అమ్ముకుంటున్నారు. దీంతో రైతులకు కనీసం గిట్టుబాటు ధర అందని పరిస్థితి నెలకొంది.

జిల్లా వ్యాప్తంగా..

- జిల్లాలో ఈ ఏడాది 2.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినా.. ఆశించిన మేర దిగుబడి రాలేదు.
- హుస్నాబాద్ కాటన్ మిల్లులకు జనగామ జిల్లా తరిగొప్పుల, చీలుపూర్, హన్మకొండ జిల్లా వేలేరు, పీచర, కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలతో పాటు చేర్యాల, మద్దూరు మండలాల్లో పత్తి సాగవుతోంది.
- హుస్నాబాద్ మండలం గుంటూరుపల్లె ఏటా సుమారు 4,500 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది.
- ఆరు నెలలు పత్తిని ఇంట్లో నిల్వ చేయడంతో తేమశాతం తగ్గి క్వింటాలుకు 20 కిలోల చొప్పున నష్టపోతున్నారు.
- వ్యాపారులు గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి రూ.7,200లు చెల్లించి పత్తి కొనుగోలు చేస్తున్నా, రైతులకు గిట్టుబాటు కావడంలేదు.
- గ్రామాల నుంచి సేకరించిన పత్తిని వ్యాపారులు మహారాష్ట్రకు తరలించి విక్రయిస్తున్నారు.
- అక్కడ క్వింటాలుకు రూ.8,500ల ధరకు అమ్ముతుండడంతో క్వింటాలుకు రూ.1000 నుంచి రూ.1,500ల వరకు లాభం వస్తోంది.
- పక్క రాష్ట్రాలకు తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చులకు బయపడి లోకల్ వ్యాపారులకే పత్తిని కట్టబెడుతున్నారు.
- రైతుల నుంచి సేకరించిన పత్తిని మొత్తం పొరుగు రాష్ట్రాలకు తరలించడంతో స్థానికంగా కాటన్ మిల్లులుకు పత్తి రావడంలేదు.
- గతేడాదితో పోలిస్తే వరకు 35శాతం పత్తి కూడా రాలేదని మిల్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఆరు నెలలుగా ధర పెరగలే



20 ఎకరాల్లో పత్తి సాగుచేశా. ధర పెరుగుతుందే మోనని ఆరు నెలలుగా ఎదురు చూశా. 450 క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ చేశా. పత్తి బరువు తగ్గుతుండడంతో స్థానిక వ్యాపారులకు విక్రయించా. క్వింటాల్‌కు రూ.3వేలు చొప్పున నష్టపోయా. ఇంత కాలం దాచినా ప్రయోజనం లేకుండా పోయింది.

– బాలస్వామి, గుంటూరుపల్లె

క్లుప్తంగా

కలుషిత నీరు తాగిన గేదెలకు అస్వస్థత



గేదెకు గ్లూకోజ్ ఎక్కిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: కలుషిత నీరుతాగిన పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ, అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్, ఐలాపూర్‌కు చెందిన దాదాపు 35 బర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. బుధవారం బర్రెల యజమానులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవాగులో నీరు తాగిన బర్రెలు అస్వస్థతకు గురవడంతో వాటికి వైద్యం చేయిస్తున్నట్లు చెప్పారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

నర్సాపూర్ రూరల్: ఊరు కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన నర్సాపూర్ మండలం తుల్జారాంపేట గిరిజన తండాలో బుధవారం వేకువ జామున జరిగింది. బాధితులు గొర్రెల యజమాని రాజు నాయక్, తండావాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నునావత్ రాజు నాయక్ గొర్రెలను ఓ పాకలో ఉంచి పెంచుకుంటున్నాడు. పాక వద్దే ప్రతీరోజు కాపలా ఉంటాడు. బుధవారం వేకువ జామున ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో గొర్రెల పాకపై ఊర కుక్కలు దాడిచేయడంతో 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 15 గొర్రెలు గాయపడ్డాయి. సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు రాజు ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కొల్చారం(నర్సాపూర్): విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం మండల కేంద్రం కొల్చారం లో జరిగింది. బాధితురాలు చింతలగారి యాదమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయ బోర్లకు కరెంటు సరఫరా చేసే విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. గ్రామ శివారులోని పెరుమాండ్ల కుంటలో నీళ్లు తాగడానికి వెళ్లిన గేదె వాటిని తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సంఘటన స్థలాన్ని గిర్దావర్ శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ గట్టయ్య, విద్యుత్ అధికారులు సందర్శించి పంచనామా చేశారు. పాడిగేదె విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు యాదమ్మ విజ్ఞప్తి చేసింది.



గేదె కళేబరం

భేతాళస్వామి జాతరకు వేళాయె

- రాష్ట్రంలో మొదటి భేతాళ స్వామి ఆలయం
- జిల్లాలో ఏడుపాయల జాతర తర్వాత భేతాళ స్వామి జాతర
- పొరుగు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లుచేసిన జాతర నిర్వాహకులు



ఆలయంలో కొలువైన భేతాళ స్వామి



అల్లాదుర్గంలో భేతాళ స్వామి ఆలయం

అల్లాదుర్గం (మెదక్): భేతాళుడి కథలు చాలా ప్రాచుర్యంలో ఉన్నాయి. అలాంటి భేతాళస్వామి ఆలయం కూడా ఉండటం చాల అరుదు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలి ప్రజలు మృత్యువాత పడటంతో భేతాళుడి విగ్రహన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పూజలు చేయడంతో వ్యాధులు దూరం కావడం, కోరిన కోరికలు తీరడంతో వారి నమ్మకం రెట్టింపు అయ్యింది. ప్రజలకు అపార నమ్మకం కలగడంతో భేతాళుడికి జాతర నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

- మెదక్ జిల్లాలో ఏడపాయల జాతర తర్వాత అల్లాదుర్గం భేతాళ స్వామి జాతర ఘనంగా జరుగుతుంది. ఈ జాతరకు చుట్టు పక్కల ప్రాంతాల వారే కాక కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివస్తారు.
- రాష్ట్రంలో ఎక్కడా లేని మొట్టమొదటి భేతాళ స్వామి దేవాలయం అల్లాదుర్గంలోనే ఉంది. ఈ ఆలయం నాలుగు వందల ఏళ్ల క్రితమే ఉన్నట్లు స్థానికులు చెబుతారు.
- ఈ స్వామివారి ఆలయానికి తలుపులు ఉండవు. క్షుద్రపూజలు చేసే కొందరు ఆలయాన్ని అపవిత్రం చేయడంతో ఆలయం చూట్టు ఇనుప చువ్వలతో కంచె ఏర్పాటు చేశారు.
- భేతాళుడికి మొక్కుకున్న భక్తులు బోనాలు, గండ జ్యోతితో ప్రదీక్షణలు చేస్తారు.
- అల్లాదుర్గంతో పాటు చూట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు లెడ్ల బండ్లను అలంకరించి మేళతాళలతో ఆలయం చట్టూ తిప్పుతారు.
- భక్తులు బోనాలు, గండజ్యోతిని బండ్లను కట్టి ఆలయం చూట్టు ప్రదిక్షణలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు మేకలు, కోళ్ల స్వామికి సమర్పిస్తారు.
- భేతాళ స్వామిపై భక్తితో అల్లాదుర్గంతో పాటు చూట్టు పక్క గ్రామాలలోని ప్రజలు తమ పిల్లలకు భేతయ్య, భేతమ్మ పేర్లను ఎక్కువగా పెట్టుకుంటారు. అల్లాదుర్గంలో ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి ఇవే పేర్లు ఉండటం విశేషం.

జాతర వివరాలు

భేతాళస్వామి జాతర వారం పాటు ఘనంగా జరుగుతుంది. వేలాదిమంది భక్తులు తరలివస్తారు. 7వ తేదీన పోలేరమ్మకు బోనాలు, 8న పోచమ్మకు బోనాలు సమర్పిస్తారు. 9వ తేదీన దుర్గమ్మకు, 10న భేతాళస్వామికి బోనాలు తీయడం జరుగుతుంది. 11న భేతాళస్వామి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లు తిరుగుతాయి. 12న భజనలు, 13న భాగవతములు, 14న వినోద కార్యక్రమాలు, 15న ఉదయం భేతాళస్వామి ఆలయం చుట్టూ పాచిబండ్లు తిరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈర్ల అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి



శ్రీకర్‌రావు (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): బైక్‌ను అడవి పంది ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన కాసులాబాద్‌లో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొంపెల్లి శ్రీనివాసరావు కుమారుడు శ్రీకర్‌రావు (17) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల పరీక్షలు పూర్తి కావడంతో స్వగ్రామం వచ్చాడు. ఇంటి వద్దే ఉంటూ తండ్రితోపాటు పొలం పనులకు వెళ్తున్నాడు. పొలం పనులకు బైక్‌పై కాసులాబాద్ నుంచి దుబ్బాక మండలం హబ్సీపూర్ రోడ్డు గుండా వెళ్తున్నాడు. కాగా రోడ్డుకిరువైపులా దట్టమైన అడవి ఉండటంతో తరచూ అడవి పందులు రోడ్డు దాటుతుంటాయి. ఈ నేపథ్యంలో రోడ్డు గుండా వెళుతున్న శ్రీకర్‌రావు బైక్‌ను రోడ్డు దాటుతున్న అడవి పంది వేగంతో ఢీకొట్టడంతో అతడు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

చెట్టును ఢీకొన్న బైక్

ఒకరు మృతి, మరొకరికి గాయాలు



బాబులాల్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాబులాల్ (23), కల్లారం బతుకుదెరువు కోసం వచ్చి హైదరాబాద్ రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం బాబు లాల్, కల్లారం బైక్‌పై రామచంద్రపురం పరిధిలోని వెల్లమెల గ్రామ శివారులో హాల్ మార్క్ విల్లాస్‌లో పని కోసం వెళ్తుండగా మార్గంలోని వెల్లమెల శివారులో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి విద్యుత స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర బాబూలాల్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం రామచంద్రపురం పరిధిలోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు బాబూలాల్ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. గాయపడ్డ కల్లారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాపర్ వైర్లను తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్



కాపర్ వైరును తరలిస్తున్న వారిని అరెస్ట్ చేసిన పోలీసులు

జహీరాబాద్: కాపర్ వైర్లను తరలిస్తున్నవారిని అరెస్ట్ చేసినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మొగుడంపల్లి మండలం గుడ్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి అనుమానిత ఎలక్ట్రిక్ వైర్లను కాల్చి కాపర్ వైర్లను తరలిస్తున్న మొగుడంపల్లికి చెందిన వజియొద్దీన్, ఎండి యూసూఫ్, ఆసిఫ్‌ను అరెస్ట్ చేశారు. అక్రమంగా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి, మానవ మనుగడకు హాని కలిగించే విధంగా వాతావరణాన్ని కలుషితం చేస్తున్నందుకు అదుపులోకి తీసుకున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సంజీవ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి అదృశ్యం



ప్రభాకర్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చెత్త కాగితాల సేకరణకు వెళ్లి ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యయ్యారు. ఈ సంఘటన బుధవారం పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి గత ఏడాది బతుకుదెరువు కోసం వచ్చిన వారు పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ శివారులో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. చెత్త కాగితాలు సేకరిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 3వ తేదీన కాగితాలు సేకరించేందుకు ఇద్దరు బాలికలు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని విచారించినా వారి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్గల్(గజ్వేల్): షార్ట్ ఫిల్మ్ షూటింగ్ కోసం వెళ్లిన యువకుడి జాడ తెలియరాలేదు. ఈ సంఘటన వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరిపల్లికి చెందిన వొంకి ప్రభాకర్(27) కొద్దిరోజులుగా షార్ట్‌ఫిల్మ్ షూటింగులు చేస్తున్నాడు. అదేవిధంగా సోమవారం షూటింగ్‌కు వెళుతున్నట్లు భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తరువాత తిరిగిరాలేదు. అతడి ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉంది. బంధువులను, తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి భార్య రజని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్ట్ షాపులపై దాడులు

నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఎక్సైజ్ పోలీసులు బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం కర్ధనూర్ గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించేవారి సమాచారం తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఐదుగురి అరెస్ట్



పోలీసులు సీజ్ చేసిన సెల్ ఫోన్లు, నగదు

దుబ్బాకరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన బుధవారం జరిగింది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన ఏడుగురు వ్యక్తులు రాజక్కపేట నుంచి మల్లన్నగుట్టకు వెళ్లే దారిలో పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్‌లు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.13,550 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

రెండు షాపుల్లో చోరీ

సీసీ పుటేజీలో దొంగతనం దృశ్యాలు నమోదు

పటాన్‌చెరు టౌన్: రెండు షాపుల్లో గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం బాధితుడు నరేశ్, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం చౌరస్తా సమీపంలో తెల్లవారుజామున గుర్తు తెలియని ముగ్గురు దొంగలు ప్లయివుడ్ షాపులో రూ.80 వేల నగదు, పక్కనే ఉన్న సిమెంట్ షాపులో ఉన్న రూ.7 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ దృశ్యాలు సీసీ పుటేజ్‌లో నమోదయ్యాయి. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు ఇతర రాష్ట్రాల వారై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.



సీసీ పుటేజీలో దొంగల కదలికలు

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

తూప్రాన్: రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు కామారెడ్డి రైల్వే పోలీసులు బుధవారం తెలిపారు. మనోహరాబాద్-మాసాయిపేట్ రైల్వే స్టేషన్‌ల మధ్య 568 నంబర్ వద్ద సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళ మృతదేహం పడి ఉంది. మృతురాలు ఎరుపు, పచ్చ, గులాబీ రంగుల చీర, ఎరుపు రంగు జాకెట్ ధరించింది. వివరాలు తెలిసినవారు కామారెడ్డి పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్‌ఐ తావునాయక్ సూచించారు. వివరాలు 94400700034, 9703217723 నంబర్‌లకు తెలపాలన్నారు.

ఫోన్‌తో అపరిచితుడి పరారీ

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఫోన్ మాట్లాడి ఇస్తానని అపరిచితుడు ఫోన్‌తో ఉడాయించి సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. బుధవారం బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్‌కు చెందిన రాంరెడ్డి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లేందుకు తన ఆటోలో బయలు దేరాడు. ఈ క్రమంలో పటాన్‌చెరు సాకి చెరువు సమీపంలో ఆగి ఉండగా, ఓ వ్యక్తి రాంరెడ్డి వద్దకు వచ్చి అర్జెంట్‌గా ఓ ఫోన్ కాల్ చేసుకోవాలని బ్రతిమిలాడి ఫోన్ తీసుకున్నాడు. ఫోన్ మాట్లాడిన అనంతరం డయల్ చేసిన నంబర్‌ను డిలిట్ చేసి ఇస్తానని చెప్పి ఫోన్‌తో పరారయ్యాడు. దీంతో బాధితుడు వెంటనే పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి

- విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలి
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్‌లోని బాలికల గురుకుల కళాశాల ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నారాయణఖేడ్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థినిపై అఘాయిత్యం జరిగితే తొమ్మిది నెలలుగా కేర్‌టేకర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ముళ్లపొదల్లో పసికందు దొరికినా పోలీసులు విచారణ ఎందుకు చేయలేదన్నారు. ఘటనను కప్పిపుచ్చడంలో అధికారపార్టీ నాయకులు హస్తం ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంవల్లే గురుకులాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయన్నారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుని విద్యార్థినిలతోపాటు తల్లిదండ్రులకు భరోసా కల్పించాలన్నారు. సిర్గాపూర్ గురుకులంలో ఓ విద్యార్థిని మూడునెలల క్రితం భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నా బాధ్యులపై చర్యలు లేవన్నారు. గురుకులం ఘటనపై తాను నాలుగురోజుల కిందటే జాతీయ బాలల కమిషన్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో డీసీసీ మాజీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు భోజిరెడ్డి, కౌన్సిలర్ దారం శంకర్, నాయకులు హన్మాండ్లు, యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వరకట్న వేధింపులతో వివాహిత, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి, స్థలం విషయంలో తండ్రితో గొడవపడిన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వరకట్న వేధింపులు, కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. బుధవారం సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన నాగులపల్లి మల్లేశ్వరీ(20)కి అదే గ్రామానికి చెందిన సార మధుతో 16 నెలల క్రితం ప్రేమ వివాహమైంది. ఆరు నెలల పాటుగా వీరి సంసారం సాఫీగానే సాగింది. అనంతరం భర్త మధు, అత్త తరుచుగా వరకట్నం తీసుకురావాలని వేధించేవారు. దీంతో మానసిక వేదనకు గురైన మృతురాలు ఈనెల 4వ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పాపన్నపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని అర్కెల గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. మృతుడు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిట్యాల ఊశయ్య (55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి నలుగురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పంటల సాగుకు, కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం కానరాక పొలం వద్ద ఆత్మహత్య కేసుకున్నాడు. ఎస్‌ఐ విజయ్‌ను వివరణ కోరగా తమకు ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.



శ్రీకాంత్ (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): తండ్రితో గొడవపడి మనస్తాపానికిగురై కొడుకు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తదొమ్మాట గ్రామంలో బుధవారం జరిగింది. మృతుడి తండ్రి చెట్టి నర్సయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం స్థలం కొనుగోలు విషయమై తండ్రి, పెద్ద కుమారుడు చెట్టి శ్రీకాంత్(25)కు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. రాత్రి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి బంధువులు, మిత్రులను విచారించగా అతడి ఆచూకీ తెలియరాలేదు. బుధవారం గ్రామస్తుడు చింతల పర్శ రాములు ఆకునూరు రోడ్డులో పాలిటెక్నిక్ కళాశాల వెనుక గుర్తు తెలియని మృతదేహం పడిఉందని ఇచ్చిన సమాచారం ఇచ్చాడు. అక్కడికి వెళ్లి చూడగా శ్రీకాంత్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారు సర్వీసు రోడ్డు ఫ్లయిఓవర్ వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బుధవారం పుల్కల్ ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట శివారులోని ఫ్లయిఓవర్ వద్ద వ్యక్తి పడి ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన చేరుకునేలోగా చనిపోయి ఉన్నాడు. స్థానికుల సహాయంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో శవపంచనామా కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగు షర్టు, నలుపు రంగు గీతల ప్యాంటు ధరించాడు. వివరాలకు జోగిపేట సీఐ ఫోన్ నంబర్ 87126 56723, పుల్కల్ ఎస్‌ఐ 87126 56754 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హిందువులు ఐకమత్యంగా ఉండాలి

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్

చిన్నశంకరంపేట(మెదక్): హనుమాన్ సేవలో పాల్గొనడం గొప్ప అనుభూతిని పొందడంతో పాటు హనుమాన్ నామస్మరణ మానవులకు ఎంతో శక్తిని ఇస్తుందని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామివారికి చందనోత్సవం, అభిషేకం చేశారు. అనంతరం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పండరినాథ్ మాట్లాడుతూ చిన్నశంకరంపేటలో హనుమాన్ శోభయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోగుల రాజు, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆవుల గోపాల్‌రెడ్డి, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, కమిటీ సభ్యుడు వనం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నాడని ఆరోపణ

మద్దూరు(హుస్నాబాద్): అదనపు కట్నం కావలంటూ కాపురానికి తీసుకెళ్లకుండా వేధిస్తున్న భర్త ఇంటి ఎదుట భార్య ధర్నాకు దిగిన ఘటన మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాయపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగె శ్రీనివాస్‌రెడ్డికి 2019లో అంజలితో వివాహమైంది. అప్పటి నుంచి అదనంగా డబ్బులు తేవాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. భర్త వేధింపులు తాళలేక సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కౌన్సెలింగ్ ఇచ్చారని, అయినా మార్పు రాలేదు. డబ్బులు ఇవ్వాలని, లేదంటే విడాకులు ఇస్తానంటూ బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం జరిగే వరకు ధర్నా చేస్తానని బాధితురాలు తెలిపింది.



మహిళా సంఘాలతో కలిసి ధర్నా చేస్తున్న బాధితురాలు

క్లుప్తంగా

చదువుతోనే భవిష్యత్

జగదేవ్‌పూర్(గజ్వేల్): చదువుతోనే సమాజంలో గుర్తింపు, భవిష్యత్ ఆధారపడి ఉంటుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి తిగుల్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, సర్పంచ్ భానుప్రకాష్‌రావు, ఉపసర్పంచ్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



చేర్యాల(సిద్దిపేట): కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

సిద్దిపేటకమాన్: 2018 ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పై ఉందని రెడ్డి సంఘాల ఐక్యవేదిక నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డిలు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 8న సిద్దిపేట పట్టణంలోని బైరి అంజయ్య గార్డెన్‌లో రెడ్డిల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. రెడ్డి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 8న బైరి అంజయ్య గార్డెన్‌లో నిర్వహిస్తున్న రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్ల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ జక్కిరెడ్డి నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణితో కలిసి సమ్మేళన కరపత్రాలు ఆవిష్కరించారు. మార్కెట్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీదర్‌రెడ్డి, ఆగంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు మార్కెట్ బంద్

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్ యార్డుకు అధికారులు మూడు రోజులు సెలవులు ప్రకటించారు. రైతులు సెలవు దినాల్లో సరుకులను మార్కెట్‌కు తీసుకరావద్దని మార్కెట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.7న గుడ్ ఫ్రైడే, 8న బ్యాంకులకు సెలవు, 9న వారాంతపు సెలవు. దీంతో మార్కెట్ మూడు రోజులు బంద్ ఉంటుందని వారు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మండల కోఆప్షన్ సభ్యులు అజీమొద్దీన్ పేర్కొన్నారు. కుకునూరుపల్లిలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లం ఐలయ్యతో కలిసి బుధవారం మిద్దెల వజ్రమ్మకు రూ. 28వేల చెక్కును అందజేశారు.

వడగళ్ల వాన



మద్దూర్‌లో వర్షం

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంతో పాటుగా, పలు గ్రామాల్లో బుధవారం వడగండ్ల వర్షం కురిసింది. సాయంత్రం 5.30గంటల నుంచి 6గంటల వరకు గాలి దుమారంతో వడగల్ల వాన పడింది. అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వడగండ్ల వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిత్యావసర సరుకులు అందజేత

రేగోడ్(మెదక్): మండలంలోని మర్పల్లి గ్రామానికి చెందిన హంజాత్ కొద్ది రోజులుగా కిడ్నీ సమస్యతో పాటు ఆర్థిక పరిస్థితి కూడా బాగా లేక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో హంజాత్‌ను ఆదుకునేందుకు స్థానికులు ముందుకొచ్చారు. బుధవారం గ్రామానికి చెందిన గున్న దత్తు రాజు, గున్న వెంకటేశం, పట్లోళ్ల అంజిరెడ్డి, చాకలి రాములు, భోగి విజయ్ కుమార్, దానం శ్రీకాంత్‌రెడ్డి కలిసి హంజాత్‌కు నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం కూడా స్పందించి తగిన సాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

'గుడిసెలు లేని తండాలుగా తీర్చిదిద్దుతా'

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తండాల్లో గుడిసెలు లేకుండా పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తానని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆత్మగౌరవ యాత్రలో భాగంగా చేగుంట మండలంలోని గొల్లపల్లితో పాటు మిర్యాలీ తండాల్లో శ్రీనివాస్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించి తండాలన్నింటిని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఆగం, నవీన్, స్టాలిన్, నర్సింలు, మోహన్‌నాయక్, రాజు, శంకర్‌నాయక్, తాహిర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తపస్ ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం



హుస్నాబాద్‌రూరల్: జయంతిలో ఎంపీపీ లకావత్ మానస



దుబ్బాకటౌన్: దుబ్బాకలో బాబూజగ్జీవన్ రామ్ జయంతి



సిద్దిపేటజోన్: జయంతిలో మంజుల రాజనర్స్



చేర్యాల(సిద్దిపేట): మున్సిపల్ కార్యాలయంలో నివాలులు అర్పిస్తున్న చైర్ పర్సన్ స్వరూపరాణి



కొండపాక(గజ్వేల్): నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, సర్పంచ్‌లు గాజుల బాబు, ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ జమున ఎల్లయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, జగ్జీవన్‌రామ్ సంఘం అధ్యక్షుడు ఎల్లం నివాళులు అర్పించారు.

చేర్యాల(సిద్దిపేట): మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డిలు పూలమాల వేసి నివాలులు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు ఎం.నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుస్నాబాద్: డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గొప్ప సంఘసంస్కర్త అని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో

అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించారు. దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర జేఏసీ చైర్మన్ బత్తుల చంద్రమౌళి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నివాళులు అర్పించారు. టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లిలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపీపీ గజ్జెల సాయిలు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, సర్పంచ్ రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ధర్మారం బాబు, పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: ఎంపీపీ లకావత్ మానస మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బాబు జగ్జీవన్‌రామ్ వేడుకల్లో మాట్లాడారు. గ్రామాల సర్పంచ్‌లు వంగ విజయలక్ష్మి, దుంద్ర భారతియాదగిరి, బత్తుల మల్లయ్య, బత్తిని సాయిలు నివాళ్లు అర్పించారు.

సిద్దిపేటజోన్: మున్సిపల్ చైర్మన్ మంజులరాజనర్స్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, మాజీ చైర్మన్ రాజనర్స్ పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కొండపాకలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, ఎంపీడీఓ కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎంపీడీఓ రాంరెడ్డి, సర్పంచ్ మాధురిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఎంపీటీసీ భూములుగౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు ఆజీమొద్దీన్, మాజీ సర్పంచ్ కాచం నవీన్‌కుమార్, దుద్దెడ గ్రామంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేయగా దర్గా, సిర్సనగండ్ల, ఖమ్మంపల్లిలో నిర్వహించారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరత్‌కుమార్ నిర్వహించారు. ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఎస్ఐ ప్రవీణ్‌రాజు, సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, ఎంపీటీసీ శారద, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ నిర్వహించారు. సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

కొముురవెల్లి(సిద్దిపేట): సర్పంచ్ సార్ల లత, జడ్పీటీసీ సిద్ధప్పతో కలసి ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బంగ్లాదేశ్ విభజనలో తన వంతు ముఖ్య భూమిక పోషించారని తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో బీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు తిరుపతి, జనార్ధన్, నర్సిరెడ్డి, మహేందర్ రెడ్డి, మండల బాధ్యులు బుచ్చిరెడ్డి, దేవదాసు, లోకేష్, రాములు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, గౌరవ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపి నాయకులు



కోహెద(హుస్నాబాద్): కోహెదలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్ననాయకులు



దుబ్బాకటౌన్: దుబ్బాకలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



కొముురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను అక్రమ అరెస్ట్ చేసినందుకు నిరసనగా మండల అధ్యక్షుడు దోనె అశోక్ బెజ్జంకిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మహేందర్, రాజు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్ అక్రమ అరెస్టు నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రవీణ్, తిరుమల్‌రెడ్డి, పాల్గొన్నారు.

కొముురవెల్లి(సిద్దిపేట): బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. దండ్యాల లక్ష్మారెడ్డి, గనెబోయిన శ్రీనివాస్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

హుస్నాబాద్: ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య పట్టణంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాకేష్, చరణ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

కోహెద(హుస్నాబాద్): కోహెడ మల్లన్న చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పిల్లి నర్సయ్య, రజనీకాంత్‌రెడ్డి, వేంకటేశ్వర్లు, రవీందర్, పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట బీజేపీ మండలాధ్యక్షుడు గొల్లపెల్లి వీరాచారి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి కర్ణకంటి నరేష్, మండల ప్రధాన కార్యదర్శి భూక్య సుధాకర్‌నాయక్, పిట్టల హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

కోహెద(హుస్నాబాద్): కోహెడ అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో దూలం శ్రీనివాస్, వేంకటస్వామి, బాలకిషన్, పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: వీర సావర్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ములుగు(గజ్వేల్): బీజేపీ అధ్యక్షుడు పల్లె రమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీనీ దహనం చేశారు. జిల్లా ఓబీసీ కార్యదర్శి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, రాజుగౌడ్, చారి, తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి కుకునూరుపల్లిలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఓబీసీ మోర్చ అధ్యక్షుడు గౌరారం కృష్ణ, పోచమైన స్వామి, ఉపాధ్యక్షుడు నీల సత్యం, దాసరి స్వామి, దొంతి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం దారుణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. దుబ్బాక బస్టాండ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు.

గజ్వేల్‌రూరల్: బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా బీజేపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ యాదవ్, గజ్వేల్ అసెంబ్లీ కోకన్వీనర్ బండారు మహేశ్ పాల్గొన్నారు.



సిద్దిపేటజోన్: బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



కోహెద(హుస్నాబాద్): కోహెదలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

◆ మిత్రుడి కుటుంబానికి సాయం

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డ మిత్రుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. మిరుదొడ్డిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండ వెంకటేశం(47) కుటుంబానికి 1991 టెన్త్ బ్యాచ్ స్నేహితులు బుధవారం పరామర్శించారు. రూ. 46వేల ఆర్థిక సాయం అందజేశారు. ర్యాకం మల్లేశం, గడ్డం విద్యా సాగర్, నేరండ్ల పర్శరాములు, ఎండీ అహ్మద్, రాందేవ్ చంద్రశేఖర్, గడ్డం మహదేవ్, వేముల బాలరాజు తదితరులు ఉన్నారు.

◆ బ్రహ్మోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని బెజ్జంకి ఎస్ఐ ప్రవీణ్‌రాజు సూచించారు. బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో బుధవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, సర్పంచ్ ద్యావపెల్లి మంజుల పాల్గొన్నారు.

◆ వీర సావర్కర్ స్ఫూర్తితో నడవాలి

సిద్దిపేటకమాన్: వీర సావర్కర్ స్ఫూర్తితో యువత ముందుకు నడవాలని సేవా సమితి అధ్యక్షుడు రాజ్‌రతన్ గౌడ్, ఉపాధ్యక్షుడు సుమన్ అన్నారు. సావర్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేస్తున్న వారికి, బాటసారులకు చలివేంద్రం ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఆనంద్, విజయ్, బాలరామకృష్ణ, వెంకట్(పంతులు), వెంకటేష్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం వద్ద సావర్కర్ సేవా సమితి సభ్యులు

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు



సిద్దిపేటకమాన్: సిద్దిపేట బస్టాండ్ చౌరస్తాలో



హుస్నాబాద్: బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): టెన్త్ పరీక్షా పేపర్ లీకేజీ కుట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మిరుదొడ్డిలో ఆయన దిష్టి బొమ్మను దహనం చేశారు. మండల అధ్యక్షుడు ధర్మారం కుమార్, జిల్లా నాయకుడు సూకూరి లింగం, ఏవీ రాకేష్, నేరండ్ల నరేష్, వంగ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రధాన పాత్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌దేనని ఆరోపిస్తూ బీఆర్ఎస్‌వీ నాయకులు ఆయన దిష్టిబొమ్మ దమనం చేశారు. పాల సాయిరాం, మహేశ్, కనకరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: పేపర్ లీకేజీలో బీజేపీ కుట్ర ఉందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ ఆరోపించాడు. పట్టణంలో బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు గందె చిరంజీవి, యూత్ అధ్యక్షుడు కామిరెడ్డి క్రాంతి, రమేశ్ నాయక్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం'



మద్దూరు(హుస్నాబాద్): అరెస్టయిన బీజేపీ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ అరెస్టు సందర్భంగా మండల బీజేపీ నాయకులను బుధవారం ముందస్తుగా అరెస్టు చేసి చిన్నకోడూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లా అధికార ప్రతినిధి భూమేష్ గౌడ్, మండల అధ్యక్షుడు పర్శరాములు మాట్లాడారు. రాజిరెడ్డి, భాస్కర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని రాష్ట్ర హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీరాంచక్రవర్తి మాట్లాడుతూ బండి సంజయ్‌ని అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, కౌన్సిలర్లు కోమటి స్వర్ణలత, వేణుయాదవ్ తదితరులు ఉన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): బీజేపి నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని బీజేవైఎం జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలతో రాష్ట్ర ప్రజలను, యువకుల జీవితాలను నాశనం చేస్తుందన్నారు.

గజ్వేల్‌రూరల్: బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్, రమాకాంత్, సతీష్‌గౌడ్, మేరనవీన్‌లను గజ్వేల్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాశెట్టి పాండు నిరసన చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ పోతుగంటి రాందాసు, జిల్లా కార్యదర్శి రేకులపల్లి విజయలక్ష్మి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నిమ్మ మహేందర్‌రెడ్డి, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కులతో ఆహ్లాదకర వాతావరణం



పనులను పరిశీలిస్తున్న గన్నె వనిత భూంరెడ్డి

మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాకటౌన్: పార్కులతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకే పార్కులు నిర్మిస్తున్నామని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 18 వ వార్డులో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు, చిల్డ్రన్స్ పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తుమ్మ భానుచందర్, గోనె మధు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా యాదగిరి

చేర్యాల(సిద్దిపేట): ఎంపీటీసీల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండల పరిధిలోని కడవేర్గు ఎంపీటీసీ సభ్యుడు గదరాజు యాదగిరిని నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్ బుధవారం ప్రకటించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్‌తో కలిసి యాదగిరికి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తానన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న యాదగిరి

ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వాలు

టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసగిస్తున్నాయని టీపీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో కలిసి దరిపల్లి చంద్రం మాట్లాడారు. ప్రజలను అయోమయం చేయడానికే బీఆర్ఎస్, బీజేపీలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. ఒక పార్టీకి పోటీగా మరో పార్టీ రోజుకో కొత్త నాటకానికి తెర తీస్తున్నాయన్నారు. ఒకరిపై ఒకరు కేసులు వేసుకుంటూ విచారణల పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తప్పెట శంకర్, బిక్షపతి, రాములు, బర్మా రామచంద్రం, గయాజుద్దీన్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దరిపల్లి చంద్రం